వానాకాలం సాగుకు సమాయత్తం

- సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ
- విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచిన అధికారులు


శివారెడ్డిగూడెంలో మొలక చల్లుతున్న రైతు


ముక్తాపూర్‌పరిధిలో పెరిగిన వరినారు

భూదాన్‌పోచంపల్లి : వానకాలం పంటల సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే రైతులు ట్రాక్టర్లతో దుక్కులు దున్నిస్తూ, కంపోస్ట్ ఎరువులను చల్లుతూ, నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. మూసీ పరివాహక గ్రామాల్లో రైతులు రోహిణి కార్తె ప్రారంభంలోనే వరినార్లు పోసుకున్నారు. కాగా మండలంలో ఈ వానాకాలం సీజన్‌లో 28వేల ఎకరాలలో వరిసాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అందుకనుగుణంగా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. కాగా మండలంలో మూసీ నది, పిలాయిపల్లి కాలువ, చెరువులు, కుంటలు, వ్యవసాయ బోర్లపై ఆధారపడి రైతులు వరిసాగు చేస్తున్నారు. దీంతో ప్రతి ఏటా వరిసాగు గణనీయంగా పెరుగుతూ వస్తుంది.

750 ఎకరాలలో మెట్ట పంటలు..

సాగు నీటి వనరులు లేని జిబ్లక్‌పల్లి, దంతూర్, కనుముకుల, దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాల్లో ఈ సీజనల్‌లో 300 ఎకరాలలో పత్తి, 200 నుంచి 300 ఎకరాలలో కంది, 150 ఎకరాలలో కూరగాయల సాగు అవుతుందని అధికారులు అంచనాలను తయారు చేశారు. ఇదిలా ఉండగా మూసీ నీటికి అనువైన ఎంటీయూ 1010, ఏఎస్ఎం118, జెబిఎల్ 24423 తదితర వరి రకాలను సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

అందుబాటులో ఎరువులు

సాగు ప్రణాళిక అనుగుణంగా వ్యవసాయాధికారులు పీఏసీఎస్‌లు, లైసెన్స్‌డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. యూరియా 450 మెట్రిక్ టన్నుల యూరియా, 600 మెట్రిక్ టన్నుల డీఏపీ, 450 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 500 మెట్రిక్ టన్నుల ఎంఓపీ అవసరమవుతుందని అధికారులు అంచనాలను రూపొందించారు. ప్రస్తుతానికి 130మెట్రిక్ టన్నుల యూరియా, 70 మెట్రిక్ డీఏపీ, 140 టన్నుల కాంప్లెక్ ఎరువులు, 40 మెట్రిక్ టన్నుల ఎంఓపీ అందుబాటులో ఉంచారు.

గుండాల : మండలంలో శనివారం సాయంత్రం కురిసిన తొలకరి వర్షాలకు రైతులు సాగు పనుల్లో బిజీబీజీ అయ్యారు. ఆదివారం పలు గ్రామాల్లో అరకలు, ట్రాక్టర్లతో అచ్చు తోలి పత్తి గింజలు పెట్టారు.


అరక తోలుతున్న రైతు

12ఎకరాలు సాగు చేస్తున్నాను



నాకు 12 ఎకరాల భూమి ఉంది. మూసీ కాలువల ద్వారా 12 ఎకరాల వరిసాగు చేస్తున్నాను. సాగు నీటి వసతి ఉండడంతో పదిరోజుల క్రితం నారు పోశాను. నారు బాగానే వచ్చిన ఎండల ప్రభావం వల్ల 20శాతం నారు ఎండిపోయింది. గత సీజన్‌లో పదకొండు వందల బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ సారి ధాన్యం దిగుబడి పెరిగే హైబ్రిడ్ వరి వంగడాలను సాగు చేస్తున్నాను. – వారాల రాంచంద్రారెడ్డి, రైతు, శివారెడ్డిగూడెం

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాం



వానాకాలంలో మండల వ్యాప్తంగా 28వేల ఎకరాలలో వరిసాగవుతుందని అంచనా రూపొందించాం. దానికి అనుగుణంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాం. ప్రస్తుతం వరినారు పెరిగే దశలో ఉంది. జూన్ రెండు, మూడో వారంలో నాట్లు వేసుకోవాలి. తప్పనిసరిగా లైసెన్స్ డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. అలాగే రసీదు తీసుకోవాలి. 48 గంటల్లో విత్తనం మొలకెత్తకపోతే వెంటనే రిటర్న్ చేయవచ్చు. – ఏజాజ్ అలీఖాన్, ఏఓ

క్లుప్తంగా

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన


హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని పెద్ద కందుకూరు గ్రామ పరిధిలో నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 3.55 కోట్లు ప్రధాన మంత్రి సడక్ యోజన క్రింద మంజూరయ్యాయని తెలిపారు. ఆమె వెంట జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, చొల్లేరు సర్పంచ్ తోటకూరి బీరయ్య, కవిడె మహేందర్, మిట్ట వెంకటయ్య, కాసావు శ్రీనివాస్, బీర్ల మహేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్

భువనగిరి : తెలంగాణ రాష్ట్ర ఆవరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాచకొండ కమిషనరేట్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం భువనగిరి ఖిల్లా నుంచి పట్టణంలోని గాంధీ పార్కు వరకు నిర్వహించే 2కే రన్‌లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి జగదీష్‌రెడ్డి, రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, ఎంపీ కోమటిరెడ్డివెంకట్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, సునీతామహేందర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్‌లు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఆలేరురూరల్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం 2కే రన్ నిర్వహించనున్నట్లు ఆలేరు ఎస్సై జి.వెంకటశ్రీను ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో యువతీ, యువకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

వాటర్ క్యాన్ల పంపిణీ


వాటర్ క్యాన్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గుండాల : మండలంలోని మరిపడిగ గ్రామంలో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ క్యాన్లను ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకుడు ఎల్లంకి సోమనర్సింహ రెడ్డి, సోమన్న, కుమార్, లక్ష్మీనారాయణ, కిష్టయ్య, ఉపేందర్, రామ్మూర్తి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల తేదీలు మార్చాలి

మోత్కూరు : మహాత్మాగాంధీ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల తేదీలు మార్చాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పోలీస్ రిక్రూట్‌మెంట్ తుది పరీక్షల ఫలితాలలో క్వాలిఫై అయిన అభ్యర్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఉన్నరోజే మహాత్మాగాంధీ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ఉండడవల్ల అయోమయానికి గురవుతున్నారన్నారు. వెంటనే పరీక్ష తేదీలను మార్చాలని కోరారు.

మహిళా సంక్షేమ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ఆత్మకూరు(ఎం): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 13న ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీ జోత్స్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

బెల్లి యాదయ్యకు సన్మానం


బెల్లి యాదయ్యను సన్మానిస్తున్న జూలూరి గౌరీశంకర్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

రామన్నపేట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన తెలంగాణ సాహిత్య దినోత్సవ సభలో రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బెల్లి యాదయ్యను సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, రాష్ట్ర గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

చౌటుప్పల్ : మండల పరిధిలోని జైకేసారం గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పేదరికంతో చదువుకు దూరం కావొద్దు


అంగన్‌వాడీకేంద్రం చిన్నారులతో కస్తూరి శ్రీ చరణ్

సంస్థాన్ నారాయణపురం: పేదరికంతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కావొద్దనే ఉద్దేశంతోనే కస్తూరి ఫౌండేషన్ ఏర్పాటు చేశానని ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ అన్నారు. మండలంలోని కోతులాపురం గ్రామంలో కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.4.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అంగవాడీ భవనాన్ని ఆదివారం ఆయన జన్మదినం సందర్భంగా ప్రారంభించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రానికి ఆట వస్తువులు,గ్యాస్ స్టవ్, పప్పు కుక్కరు, చైర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో బాలికల విద్యపై, అంగన్‌వాడీ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్ట సత్యం, అంగన్ వాడీ కార్యకర్త వీరమళ్ల విజయ, ఉపసర్పంచ్ ఇరుదిండ్ల ఇద్దయ్య, కస్తూరి ఫౌండేషన్ సభ్యులు నరేందర్ రెడ్డి, మహేష్, నవీన్‌రెడ్డి, రామకృష్ణ, జహంగీర్, నవీన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలోని ఇంద్రపాల ముత్యాలమ్మ దేవాలయంలో కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముటుకుల్లోజు రాఘవ, రాకేష్, సాయి, జగన్, హర్ష, మల్లేష్, శివప్రసాద్, వెంకట్, నవీన్, యుగేందర్, నిరంజన్, నరహరి, చరణ్, గిరి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం


మునిపంపులలో బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న కొండేటి మల్లయ్య

రామన్నపేట : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. మునిపంపుల గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన బొడ్రాయి వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామన్నపేటలో మృతిచెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బైరబోయిన రాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న బీజేపీకి, అవినీతి పాలన సాగిస్తున్న బీఆర్ఎస్‌లకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ఆయన వెంట నాయకులు సాల్వేరు అశోక్, ఎండీ జమీరొద్దిన్, అయ్యాడపు నర్సిరెడ్డి, లక్ష్మారెడ్డి, బాదె భిక్షం, ఉయ్యాల నారసింహ, కమ్మంపాటి రమేష్, యాదాసు దుర్గయ్య, ఉయ్యాల లక్ష్మీనర్సు, ఆవుల వేణు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల ఆశీస్సులు ఉంటేనే సుభిక్షం


బొడ్రాయి వద్ద పూజలు నిర్వహిస్తున్న మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

మోటకొండూర్: గ్రామ దేవతల ఆశీస్సులు ఉంటేనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బొడ్రాయి, దుర్గమ్మ ఆలయాన్ని ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విద్యుత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎంపిటీసీ బాల్ద రామకృష్ణ, ఏఈ వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ, సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత, ఉపసర్పంచ్ బుగ్గ భాగ్యలక్ష్మీభాస్కర్, విజయ్‌గౌడ్, స్వరూప, జెంగవెల్లి జహంగీర్, నాగరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి


కాంగ్రెస్‌లో చేరిన వారితో చలమల్ల కృష్ణా రెడ్డి

చౌటుప్పల్ : కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పీసీసీ ప్రధానకార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముప్పిడి కృష్ణచైతన్యతో పాటు మరికొంత మంది యువకులు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్ ఆధ్వర్యంలో చలమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మునుగోడులో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా శ్రమించాలన్నారు. పార్టీలో చేరిన వారిలో దేశగోని రాహుల్, ముప్పిడి వినయ్, మంద విజయ్‌రెడ్డి, యశ్వంత్, బైరు వంశీ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతరాజు అచ్చయ్య, బోయ దేవేందర్, రాజేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

భూదాన్‌పోచంపల్లి : పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి పద్మశాలీల అభివృద్ధి కోసం రూ.1000 కోట్లు కేటాయించాలని ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు మాజీ సభ్యుడు తడక యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎంతో నైపుణ్యం కల్గిన చేనేత కార్మికులు, మిల్లు వస్త్రాలతో పోటీ పడలేక పోతున్నారన్నారు. స్కిల్ ఇండియా అని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వాలు కూడా నైపుణ్యం కల్గిన చేనేత కార్మికులను ప్రోత్సహించడంలేదన్నారు. కులవృత్తులకు ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని పద్మశాలీలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

నాయీబ్రాహ్మణులకు షేవింగ్, కటింగ్ కిట్ల పంపిణీ


నాయీబ్రాహ్మణులకు షేవింగ్, కటింగ్ కిట్లను పంపిణీ చేస్తున్న బీర్ల అయిలయ్య

బొమ్మలరామారం : మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయీబ్రాహ్మణులకు బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షేవింగ్, కటింగ్ కిట్లను ఆదివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేష్, సర్పంచ్ రాంపల్లి మహేష్ గౌడ్, ఎంపీటీసీ మైలారం ఈదమ్మ, భూక్యా సునీత, నాయకులు రామిడి జంగారెడ్డి, యావపూర్ రాజు నాయక్,తిరుమల వెంకటేష్, జూపల్లి లింగం, రాజేష్ పైలెట్, జూపల్లి శ్రీకాంత్, ప్రేమ్ రెడ్డి, మైలారం ఈశ్వర్,బిక్షపతి, కుమార్, బాలయ్య, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

బొమ్మలరామారం : మండలంలోని మేడిపల్లి గ్రామంలో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీ ఫ్లోరైడ్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీర్ల ఫౌండేషన్ సేవలను మరింతగా విస్తరిస్తామన్నారు. అనంతరం గ్రామస్తులకు వాటర్ క్యాన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లేష్, సర్పంచ్ సుర్వీ గోవింద్ గౌడ్, నాయకులు జూపల్లి శ్రీకాంత్, బిక్షపతి, కుమార్, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శ్యామ్‌సుందర్

వలిగొండ : వాటర్‌ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యామసుందర్ రావు అన్నారు. మండలంలోని జంగారెడ్డి పల్లెలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా అందడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శివరాత్రి ఎల్లమ్మ, శివరాత్రి సాయిలు,వెంకటేష్, ఎలయ్య, రాజు, చిట్టెడి అభితేజ్ రెడ్డి, దంతూరి సత్తయ్య, నాగెల్లి సుధాకర్, రాచకొండ కృష్ణ, బొంత భాస్కర్, కాలేరు రాం చెందర్, ఆవుల బిక్షపతి, మెరుగు ప్రమోద్ కుమార్, బుర్ర శ్రీశైలం, బోగారం రాం దాసు,రామాచారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు ఇస్తున్న కౌన్సిలర్ దేవరాయ కుమార్

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని 12వ వార్డుకు చెందిన ముదిగొండ రాములుకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ. 42వేల చెక్కును ఆదివారం కౌన్సిలర్ దేవరాయ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి సీత శ్రవణ్, పగడాల పాండు, భారత గిరివాసు, కడవేరు చంద్రశేఖర్, చిట్టిపోలు లక్ష్మీకాంత్, వంగూరి సైదులు, నోముల నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట : ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఇంద్రపాలనగరంలో శ్రీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ, ధ్వజస్తంబ ప్రతి ష్ఠాపన, మునిపంపుల గ్రామంలో జరుగుతున్న బొడ్రాయి పండుగలో పాల్గొని పాల్గొని పూజలు చేశారు. ఆయనవెంట సర్పంచ్‌లు కాటెపల్లి సిద్దమ్మ, యాదాసు కవిత, ఎంపీటీసీ గాదె పారిజాత గ్రామ శాఖ అధ్యక్షుడు గర్దాసు విక్రం, మామిండ్ల అశోక్, నాయకులు కమ్మంపాటి శ్రీనివాస్‌గౌడ్, నీల దయాకర్, కాటెపల్లి యాదయ్య, మంటి లింగస్వామి, పోచబోయిన మల్లేశం, అంతటి రమేష్, మామిడి పద్మారెడ్డి, ఉయ్యాల లక్ష్మీనర్సు, వేణుగోపాల్, మల్లం క్రిష్ణమూర్తి, రామలింగం పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి

ఆలేరురూరల్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహేంద్రన్న యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి టెన్నిస్‌బాల్, క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో మహేంద్రన్న యువసేన అధ్యక్షుడు పూల శ్రవణ్, వెంకటేష్, మదర్‌డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్టమల్లేషం, జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, వస్పరి శంకరయ్య, దాసి సంతోష్, బాలస్వామి, సంపత్, పత్తి వెంకటేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం


మాట్లాడుతున్న గుండు వెంకటనర్సు

మోత్కూరు : ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మండలంలోని పాలడుగు గ్రామంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయని హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఆత్మకూరు(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు సాగు నీరందించే బునాదిగాని కాల్వకు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, దడిపల్లి ప్రభాకర్, కొంపెల్లి గంగయ్య, వడ్డేపల్లి లక్ష్మణ్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామి ఆలయ ఉత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు


ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో పచ్చని ప్రకృతి ఒడిలో కొలువు దీరిన 400ఏళ్ల పురాతన చరిత్ర కలిగిన తిరుమలనాథ స్వామి ఆలయ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామి మంగళశాసనములతో నాలుగు రోజులపాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. 12వ తేదీ సోమవారం ఉదయం అరణి మధనం, అగ్ని ప్రతిష్టా, ఛాయ దివాసము. సాయంత్రం ఆలయ వాస్తు శాంతి, జలాధివాసము నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం కర్నాంగ స్నపనము, నయనోన్మిలనము, సాయంత్రం శయాదివాసం చేస్తారు. బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ, ప్రాణప్రతిష్ఠ, ప్రథమారాధన, శాంతి కల్యాణం, నివేధన, మంగళనీరాజనములు, యజమానులకు ఆశ్వీరచనరము ఆచార్యాది ఋత్విక్ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తారు.

ఆలయ పునర్నిర్మాణం ఇలా..

జీర్ణోదయ దశలో ఉన్న ఆలయ పునర్నిర్మాణానికి ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మచ్చ చంద్రమౌళి గౌడ్ శ్రీకారం చుట్టారు. అనారోగ్యంతో చంద్రమౌళి గౌడ్ మృతి చెందడంతో ఆయన సతీమణి శ్రీదేవి బాధ్యత తీసుకుని కోటి రూపాయలతో కృష్ణ శిలతో స్వామి వారి ఆలయాన్ని పునర్నిర్మించారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

శ్రీ తిరుమలనాథ స్వామి వారి ఆలయ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు మచ్చ శ్రీనివాస్ గౌడ, మచ్చ ప్రీతమ్ గౌడ్‌లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌర్యం కలుగకుండా చలువ పందిళ్లు, కూల్ వాటర్, భోజన సదుపాయాలు కల్పించామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా ఉత్సవ మూర్తుల ఊరేగింపు

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల శ్రీ తిరుమలనాథస్వామి ఆలయంలో విగ్రహ పున: ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మచ్చ శ్రీనివాస్ గౌడ్, బల్‌రాం గౌడ్, మల్లా గౌడ్, మచ్చ శ్రీదేవి చంద్రమౌళి గౌడ్, సర్పంచ్ మచ్చ వసంతా శ్రీనివాస్‌గౌడ్,ప్రీతమ్ గౌడ్, ఆలయ కమిటి చైర్మెన్ రాగుల బల్‌రాం,రంగారామాగౌడ్, బెలిదే రామచంద్రయ్య గుప్త, జమాల్, తిర్మణి నాగరాజు, భూపతి శ్రీనివాస రావు,బొర్ర నర్సింహ,శెట్టి గౌడ్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వ మానవాళికి భగవద్గీత అనుసరణీయం

యాదగిరిగుట్ట రూరల్: సర్వ మానవాళికి భగవద్గీత అనుసరణీయమని హిందూ కమిటీల జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్, శ్రేష్ట, పంచాక్షరి, ఉపేందర్, సాయి, రాజు, యాదగిరి, లక్ష్మీనరాయణ, లత, లలిత తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు యాస మహేందర్‌రెడ్డి నానమ్మ యాస ముత్తమ్మ ఇటీవల మృతి చెందింది. ఆదివారం డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ యాస కవిత, రైతు సమితి మండల కో ఆర్డినేటర్ యాస ఇంద్రారెడ్డి, మామిడి శ్రీనువాసరెడ్డి, నాతి మల్లిఖార్జున్, గడ్డం సతీష్, క్రాంతి, ప్రదీప్ పాల్గొన్నారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంస్థాన్ నారాయణపురం: చేనతల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేనేత సహకార సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత సహకార సంఘానికి క్లస్టర్ మంజురు చేయాలన్నారు. నిరుపేద చేనేత కార్మికులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్లు, లక్ష రూపాయాల ఆర్థికసాయం పథకంలో అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బొల్ల విట్టలయ్య, సంగిశెట్టి లక్ష్మీనారాయణ, సురపల్లి వెంకటేశం, మేనేజరు విడెం వెంకటేశం, దోర్నాల భిక్షమయ్య, పగిడిమర్రి విష్ణు, సురపల్లి గాలయ్య, గంజి వేణు , సురపల్లి జనార్దన్, విడం జనార్దన్, సురపల్లి జవహర్, సింగం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత


వలిగొండ : ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అడ్డగూడూరు : మండల కేంద్రానికి చెందిన పులిపలుపుల యాదగిరి ఇటీవల మృతిచెందాడు. టీపీయూపీ వ్యవస్థాపకుడు బాలెంల సైదులు ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కురాకుల యాదగిరి, పూజారిసైదులు, బైరెడ్డి రాజురెడ్డి, శ్రీశైలం బాలరాజు, మహేష్, వరుణ్, మహేష్ పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని సంగెం గ్రామానికి చెందిన వెల్వర్తి ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మృతిడి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బ భిక్షపతి, సుధాకర్, కవిత, కృష్ణ, యాదయ్య, శంకరయ్య, నరేష్, శ్రీకాంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గుండాల : మండలంలోని వెల్మజాల గ్రామంలో ఇటీవల తాటి చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందిన గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు పడాల శ్రీనివాస్ పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మరాటి బీరప్ప, విజయ్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.